విశాఖ ఉక్కుపరిరక్షణ కోసం
5న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలి
పోస్టర్‌ను ఆవిష్కరించిన వామపక్షపార్టీలు
స్థానిక ఎన్నికల తర్వాత ఉద్యమం ఉధృతం : మధు
రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలి : సినీనటుడు ఆర్ నారాయణమూర్తి

విశాఖస్టీల్ పరిరక్షణ కోసం ఈ నెల 5న జరిగే రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని ప్రచురించిన పోస్టర్‌ను బుధవారం 10 వామపక్ష పార్టీల నాయకులు ఆవిష్కరించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యాన జరిగిన ప్రెస్‌మీట్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, వై.వెంకటేశ్వరరావు, సినీ నటుడు ఆర్ నారాయణమూర్తి, సిపిఐ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పి ప్రసాద్, పోలారి, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు హరినాథ్, ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులు పివి సుందరరామరాజు, ఎస్‌యుసిఐ నాయకులు బివిస్ అమరనాథ్ మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా సాదించుకున్న విశాఖ ఉక్కును మోడీ ప్రభుత్వం కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తోందని అన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయొద్దని ప్రజలు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తుంటే ప్రైవేట్‌పరం చేసేందుకు మోడీ ప్రభుత్వం త్రీమెన్ కమిటీని వేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఆంధ్రుల హక్కయిన విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని రాజకీయపార్టీలూ ఎన్నికల ప్రచారాన్ని పక్కనబెట్టి 5వతేదీ జరిగే బంద్‌లో పాల్గనాలని కోరారు. ఈ నెల 10నాటికి రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే విశాఖ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. సినీనటుడు ఆర్ నారాయణమూర్తి మాట్లాడుతూ తెలుగుజాతి అస్థిత్వంనుండి పుట్టిన విశాఖ ఉక్కు కోసం ఎంతోమంది త్యాగాలు చేశారన్నారు. విశాఖ ఉక్కు కోసం రైతులు 20 వేల ఎకరాలు ఇస్తే కురుపాం రాజులు ఆరువేల ఎకరాలను ఉచితంగా ఇచ్చారన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ రావడంలో ప్రస్తుతం అక్కడ భూమి విలువ ఎకరం రూ.5 కోట్లకు పైబడే వుందని అన్నారు. ఉక్కు ఉత్పత్తిలో దేశంలో ఉత్తమ కంపెనీగా వున్న విశాఖ స్టీల్స్‌కు చత్తీస్‌ఘడ్‌లో ఇనుపఖనిజం వున్న గనులను కేటాయించాలని ఎంఎన్ దస్తూరి కమిటీ సిఫార్సులు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోలేదని అన్నారు. 2000 నుండి 2014 వరకు లాభాల్లో వున్న విశాఖ ఉక్కు ఇటీవల కాలంలోనే నష్టాలు వస్తున్నాయని అన్నారు. నష్టాల నివారణకు చొరవ చూపకుండా ఏకంగా అమ్మివేయాలని నిర్ణయం తీసుకోవడం తగదని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు తమ జెండాలను పక్కనబెట్టి విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఏకం కావాలని కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జరిగే బంద్‌లో వైసిపి, టిడిపిలు పాల్గనాలని ఈ సందర్భంగా జెల్లీ విల్సన్ కోరారు. ఈ మేరకు ఆరెండు పార్టీలు ఒక ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సుందరరామరాజు, ప్రసాదు కూడా మాట్లాడారు. బంద్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు.